క్లుప్తంగా

ఎంపీటీసీ దీక్ష విరమణ

ఎల్లారెడ్డి: అన్నాసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి 21 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను గురువారం విరమించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఎంపీటీసీ దంపతులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఎంపీటీసీ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ ఎంపీటీసీకి హామీ ఇచ్చారు. డిమాండ్లను పరిష్కరించని పక్షంలో మళ్లీ దీక్ష కొనసాగిస్తానని ఎంపీటీసీ తెలిపారు. నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

విద్యార్థినికి సన్మానం



బీబీపేట: మాందాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పందిరి తన్విరెడ్డి, 'ఇస్రో యువికా–2023' కార్యక్రమంలో భాగంగా యంగ్ సైంటిస్టుకు ఎంపికై 15 రోజులు శిక్షణ పొందిన సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే యంగ్ సైంటిస్టు కార్యక్రమానికి ఎంపికైన 350 మందిలో గ్రామ విద్యార్థిని ఉండటం జిల్లాకే గర్వకారణమని అన్నారు. సర్పంచ్ రేవతి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కామారెడ్డి రూరల్: హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో గూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో సుమారు 95 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, దిన చర్యలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య కరదీపికను ఆవిష్కరించారు. సర్పంచ్ దంతెపల్లి స్వామి, వైద్యులు విజయలక్ష్మి, దేవయ్య పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో..

రాజంపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 126 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వారికి వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్లు హరీష్, దివ్యభారతి, నీరజ, హెచ్‌ఎం సుమలత పాల్గొన్నారు.

భిక్కనూరు ప్రభుత్వ హాస్టల్లో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజన చేసేముందు తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. వైద్యుడు ఆదర్శ్, హాస్టల్ వార్డెన్ సునీత పాల్గొన్నారు.

గుర్జాల్ తండాలో..

గాంధారి(ఎల్లారెడ్డి): గుర్జాల్ తండాలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులను పరీక్షించి అవసరం ఉన్నవారికి మందులు అందజేశారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లిలో గురువారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ గైని అనసూయ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి వైద్య శిబిరం ప్రారంభించారు. సర్పంచ్ లలితాబాయి, ఉప సర్పంచ్ పసుల సాయిలు, పశుగణ సహాయకుడు కిషోర్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

పాలాభిషేకం

రాజంపేట: బస్వన్నపల్లి గ్రామం నుంచి సోమారం గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు గ్రామ సర్పంచ్ శ్రీజారెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రూ.3 కోట్ల 65 లక్షలతో ఈ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ సుమన్‌రెడ్డి, ఎంపీటీసీ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

అన్నా బావూ సాఠే ఆశయ సాధనకు కృషి

మద్నూర్(జుక్కల్): అన్నా బావూసాఠే ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ అన్నారు. గురువారం మద్నూర్‌లో అన్నా బావూ సాఠే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో బీసీ, మైనార్టీ వర్గాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

అధికారుల సలహాలు సూచనలు పాటించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు సూచనలు రైతులు పాటించాలని ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోయా, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. సోయా, పత్తి పంటల్లో పేనుబంక, పచ్చ దోమ ఉన్నట్లు గుర్తించారు. నివారణకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఏఈవో ప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఒడ్డెర కాలనీలో చేతికి అందేలా వేలాడుతున్న విద్యుత్ తీగలు



ఇంటి మీదుగా విద్యుత్ తీగలు వెళ్లడంతో కర్రలను అడ్డు పెట్టిన దృశ్యం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- ఒడ్డెర కాలనీలో ఇంటి మీదుగా వెళ్తున్న వైనం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతులకు అందేలా, ఇంటిపై నుంచి తీగలు వెళ్లినా, తండాలలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నా పట్టించుకునే నాథుడు లేరని వాపోతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఒడ్డెర కాలనీలో విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండగా, కాలనీలోని గౌస్ అనే వ్యక్తి ఇంటిపై నుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఇంటిపైకి వెళ్లాలంటేనే భయం వేస్తోందని బాధితుడు వాపోతున్నారు. మండలంలోని వెల్లుట్ల తండాలో విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో తండావాసులు పెద్ద పెద్ద కర్రలను అడ్డుగా పెట్టి తీగలు కిందికి వేలాడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని కాలనీవాసులు చెబుతున్నారు. విద్యుత్ తీగల విషయమై పత్రికా ముఖంగా చెప్పి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తే కాలనీవాసులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒడ్డెర కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



వెల్లుట్ల తండాలో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో కర్రలను అడ్డు పెట్టిన తండా వాసులు

త్వరలోనే ఏర్పాటు చేస్తాం

పట్టణంలోని ఒడ్డెర కాలనీలో వేలాడే విద్యుత్ తీగల మధ్య అదనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. ఉన్నతాధికారులకు ఈ సమస్య గురించి వివరిస్తాం.

– సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ, ఎల్లారెడ్డి

ఇంటిపైకి వెళ్లాలంటే భయంగా ఉంది



ఇంటిపై నుంచి విద్యుత్ తీగలు వెళ్లడంతో ఇబ్బందిగా ఉంది. వర్షం కురిస్తే మరింత భయంగా ఉంటుంది. ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను పక్కకు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్ని మార్లు కోరినా వారు పట్టించుకోలేదు.

– గౌస్, ఒడ్డెర కాలనీ, ఎల్లారెడ్డి

చేతికి అందేలా తీగలున్నాయి



ఒడ్డెర కాలనీలో చేతికి అందేలా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ శాఖ అధికారులు వేలాడుతున్న విద్యుత్ తీగల మధ్య కొత్తగా స్తంభాలను వేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మల్లయ్య, ఒడ్డెర కాలనీ, ఎల్లారెడ్డి

గ్రామ పంచాయతీ ఎదుట వార్డు సభ్యుల ధర్నా



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట గురువారం వార్డు సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 7 నెలల క్రితం ఇతర కారణాల వల్ల సర్పంచ్ చెక్ పవర్ రద్దయింది. అయితే ఉపసర్పంచ్, ఇటీవల బదిలీపై వెళ్లిన కార్యదర్శి ఇద్దరూ ఇష్టానుసారంగా వ్యవహరించి ఖర్చు చేసిన నిధులు లెక్క చూపించకుండా బిల్లులు లేపుకొని తినేస్తున్నారని ఆరోపించారు. వారికి అనుకూలంగా ఉన్న వాళ్లకు మాత్రమే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని అన్నారు.

దీనిపై ఎంపీవో, ఇంచార్జి కార్యదర్శి హన్మంత్‌రావు వివరణ కోరగా.. చేసిన పనులకు ఎంబీ ఉంటేనే మాకు బిల్లులు ఇచ్చే అధికారం ఉందని తెలిపారు. కొందరు సభ్యులు మాత్రమే అధికారులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై వివక్ష తగదు



భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. గురువారం ఆయన సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, నరసయ్య, రమాదేవి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన నేతలు



నిజాంసాగర్(జుక్కల్): అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గురువారం బాన్సువాడ పట్టణంలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కలిశారు. పోడు భూముల పట్టాలు, ఇతర పనులను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. స్పీకర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సర్పంచులు లక్ష్మీ నారాయణ, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్‌గౌడ్, చందర్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలి



బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోను లాభాల బాటలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరు శ్రమించాలని డీఎం సరితా దేవి అన్నారు. గురువారం బాన్సువాడ బస్ డిపోలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఎంను బీఎంఎస్ కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. జిల్లాలో బాన్సువాడ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. టీఎంఎస్ సలహాదారులు వసంత్, రీజినల్ కార్యదర్శి మారుతి, డిపో అధ్యక్షుడు గురుడు అంబాజీ, గ్యారేజీ కార్యదర్శి జావిద్, తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కామారెడ్డి టౌన్/లింగంపేట: ఆర్యవైశ్యులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కేంద్రానికి చెందిన సెన్సార్ బోర్డు సభ్యుడు రామకృష్ణ గుప్తా గురువారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్యులలో చాలా మంది పేదలు ఉన్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలకు విన్నవించాలని కోరారు. ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 25 లక్షల మంది ఆర్యవైశ్యుల ఆకాంక్ష అని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి అందరికీ న్యాయం చేయాలని కోరారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వరా?

గాంధారి(ఎల్లారెడ్డి): గత వేసవి కాలంలో అకాల వర్షాలు, వడగళ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వరా? అని టీజేఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ ప్రశ్నించారు. ఎల్లారెడ్డి బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ అబద్ధాలే ఎక్కువ చెప్పారని విమర్శించారు. గురువారం ఆయన గౌరారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇస్తామన్న నష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని రైతులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తున్నామని చెప్పడమేకాని ఇవ్వడం లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చారో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాల నుంచి రక్షించాలంటూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 115వ రోజుకు చేరుకున్నాయి. గురువారం గ్రామంలోని ప్రతి కుల సంఘం నుంచి ఒక్కో ప్రతినిధి దీక్ష శిబిరంలో కూర్చుని ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే ఫ్యాక్టరీని ముట్టడించి పనులను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

కార్యక్షేత్రంలో లస్కర్లు

బాన్సువాడ రూరల్: ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ శాఖలో పనిచేసిన గ్రామ సేవకులు, వీఆర్ఏలు ప్రభుత్వ నిర్ణయంతో వివిధ శాఖలో రెగ్యులర్ పోస్టుల్లో చేరారు. కాగా నీటిపారుదల శాఖలో లస్కర్లుగా నియమితులైన ఉద్యోగులు కార్యక్షేత్రంలోకి దిగారు. గురువారం నిజాంసాగర్ ప్రధాన కాలువపై వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో 13, 14 డిస్ట్రిబ్యూటరీ పరిధిలో కాలువ కట్టపై పిచ్చిమొక్కలను తొలగించారు.

గుంతలను పూడ్చారు. డిపార్టుమెంట్ మారడం ఎలా ఉన్నా తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు.

హామీలిచ్చి మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం



లింగంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



కామారెడ్డిలో తహసీల్దార్‌కు..

సాక్షి నెట్‌వర్క్ : గత ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి అవి నేరవేర్చకుండా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ వైఫల్యాలపై మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి స్థానికంగా ఉన్న తహసీల్దార్లకు, ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. దళిత ముఖ్యమంత్రి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, జర్నలిస్టులకు ఇళ్లు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, లక్ష ఉద్యోగాలు.. ఇలా వందకుపైగా హామీలిచ్చి ఒక్కటి కూడా పూర్తిగా నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రభుత్వ ఆస్తులను అమ్మి రుణ మాఫీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వడ్డీ సహా రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. అర్హులైన వారికి త్వరగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, దళిత బంధు పథకం అర్హులకే ఇవ్వాలని కోరారు.



దోమకొండలో ఆందోళన చేస్తున్న నేతలు



జుక్కల్‌లో..



మద్నూర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన చేపట్టాలి



కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాందాస్



రాజంపేటలో మాట్లాడుతున్న అధికారి

నాగిరెడ్డిపేట/రాజంపేట: గృహలక్ష్మి దరఖాస్తులను జీపీ కార్యదర్శులు పరిశీలించి తమకు నివేదికను అందజేయాలని నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి తహశీల్దార్ రాందాస్, రాజంపేట తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో బాలకిషన్‌లు సూచించారు. ఆయా మండలాల్లో వారు పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సేకరించాలన్నారు. వారం రోజుల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ను పూర్తి చేయాలని చెప్పారు.

దళిత బంధులో అవకతవకలు



బీబీపేట: దళిత బంధు పథకంలో బీఆర్ఎస్ నాయకుల తీరు వల్ల అవకతవకలు చోటుచేసుకున్నాయని నిరసిస్తూ మల్కాపూర్‌లో దళితులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ వాళ్లకే కేటాయించారని, వారి పేర్లు మాత్రమే రాసి పంపించారని, అసలైన లబ్ధిదారులకు దళిత బంధు కేటాయించడం లేదని ఆరోపించారు. ఇకనైనా అర్హులైన లబ్ధిదారులకు దళిత బంధు అందించాలని డిమాండ్ చేశారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ



లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్‌లో గురువారం బస్ షెల్టర్ నిర్మాణానికి బీఆర్ఎస్ నాయకుడు బండి నర్సింలు భూమి పూజ చేశారు. వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సత్యం, గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజక సంఘం కమ్యూనిటీ భవనానికి..

ఎల్లారెడ్డి: పట్టణంలో రజక సంఘం భవనానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం భూమిపూజ చేశారు. రూ.10 లక్షలతో నిర్మించనున్న భవనాన్ని నాణ్యతగా నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. నాయకులు లింగం, బాలయ్య, కౌన్సిలర్ నీలకంఠం ఉన్నారు.

'మా గ్రామానికి యూటర్న్ ఏర్పాటు చేయండి'



జాతీయ రహదారిపై వాహనాలను అడ్డు పెట్టిన బ్రాహ్మణపల్లి గ్రామస్తులు

నిజాంసాగర్(జుక్కల్): తమ గ్రామానికి యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు గురువారం నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. యూటర్న్ లేకపోవడంతో తరుచు ప్రమాదాల బారినపడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జాతీయ రహదారిపైన బైఠాయించారు. దీంతో ఆ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న హైవే ఉద్యోగులు, సిబ్బంది ధర్నా వద్దకు చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. వారం రోజుల్లో యూటర్న్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

సంక్షిప్తం

నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పీజీ ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 155 మంది విద్యార్థులకు గాను 153 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సౌత్‌క్యాంపస్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ లలిత పరీక్షలు జరుగుతున్న గదులను పరిశీలించించారు.

ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యుడు డాక్టర్ అరుణ్ పరీక్షలు నిర్వహించారు. ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలను చేయించాలని సూచించారు. సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలో అయోధ్య యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లకాటి మహేంద్ర, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు శ్రీనివాస్, కోశాధికారిగా అంబీర్ రామారావు, సెక్రటరీగా లాండే సంజీవరావు, సలహాదారులుగా గోజారి బాల స్వామి, తదితరులు ఎన్నికయ్యారు.

ఫ్రెండ్స్ యూత్ క్లబ్..

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి ఫ్రెండ్స్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంశీ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా దేవరాజ్, కోశాధికారిగా హరీష్ గౌడ్, సభ్యులుగా శేఖర్, సుభాష్, తదితరులు ఎన్నికయ్యారు.

రెండు మొబైల్ ఫోన్ల అప్పగింత

గాంధారి(ఎల్లారెడ్డి): ఈసీఐఆర్ అప్లికేషన్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్‌లను గుర్తించి గురువారం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు.. గుర్జాల్, పోతంగల్ గ్రామాలకు చెందిన మంత్రి బాలసాయి, అనిల్ తమ ఫోన్లు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈసీఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రాక్ చేసి మొబైల్‌లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు.

పాపన్న జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని గురువారం జై గౌడ సంఘం మండల అధ్యక్షుడు విఠల్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మండల కేంద్రంతో అన్ని గ్రామాల్లో పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. అలాగే ప్రతి గౌడ సోదరుడు సభ్యత్వం తీసుకోవాలన్నారు.

అంగడి బజార్‌లో రైతులకు అన్నదానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్(అంగడిబజార్)లో ప్రతివారం కూరగాయలు, పశువులను విక్రయించడానికి వచ్చే రైతులకు సిద్ధరామేశ్వర రాజేశ్వర ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రైతుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్నం అన్నదాన ప్రసాదం వితరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. సభ్యులు ప్రతీ వారం డబ్బులు పోగుచేసుకుని ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు అధ్యక్షుడు మురంశెట్టి రాములు, కన్వీనర్ మ్యాడం కృష్ణమూర్తి, కో-కన్వీనర్లు మోట్కూరి క్రిష్ణమూర్తి, తదితరులున్నారు.